ప్రజాశక్తి
సోమవారం 31 జులై 2023
5
శ్రీ సత్యసాయి

కూలీలందరికీ ఉపాధి పనులు

◆ వలసలను నివారించడమే లక్ష్యం

◆ శ్రీసత్యసాయి జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు

పీడీ రామాంజనేయులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పనులు కల్పించి వలసల నివారించడమే తమ ప్రథమ కర్తవ్యమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రభుత్వం కూలీలకు అనుగుణంగా వారికి ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అందుకోసం శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం ల్యాండ్ లెవలింగ్ పనులు చేపట్టి ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: ఈ సంవత్సరం ఉపాధి కూలీలకు పనులు కల్పించడానికి ఎలాంటి ప్రణాళికలు తీసుకుంటున్నారు.

పీడీ : ఈ ఆర్థిక సంవత్సరంలో శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 54 లక్షల పని దినాలను కల్పించాం. అందుకోసం 1.30 కోట్ల ఖర్చు చేశాం. జిల్లా వ్యాప్తంగా 50 వేల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరువేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం కార్యక్రమం చేపట్టాం. ఇందుకోసం ఉపాధి పథకం ద్వారా మూడు సంవత్సరాల పండ్ల తోటల పెంపకం కోసం రైతులకు ప్రోత్సాహం ఇస్తున్నా. ఉపాధి పనుల ద్వారా వలసలు నివారిస్తున్నామని 2023-24 ఆర్థిక సంవత్సరంలో కావాల్సిన పనులకు గుర్తింపు కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో జరుపుతున్నాం. జియో గ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా నీటి సంరక్షణ పనులు ఉమ్మడి ఆస్తుల పునరుద్ధరణ వ్యక్తిగత పనులను గుర్తించి అంచనాలు తయారు చేసి పరిపాలన అనుమతులు తీసుకుని పనులు కల్పిస్తున్నాం.

ప్రశ్న: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా ఏఏ పనులు జరుగుతున్నాయి.?

పీడీ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం చేపట్టామని జిల్లా వ్యాప్తంగా 6వేల ఎకరాల్లో పండ్ల తోటలను పెంచాలని నిర్ణయించాం. 15 రకాల పండ్ల మొక్కలు రెండు రకాల కూరగాయల పెంపకం కోసం రైతులకు ఉపాధి హామీ ద్వారా అవకాశం ఇస్తున్నాం. ఇప్పటికే రెండు వేల ఎకరాలు పూర్తి అయిందని 15 రోజుల్లోపు 4000 ఎకరాలు పండ్లతోటల పెంపకం పూర్తి అవుతుంది. చెత్తతో సంపద కేంద్రాల నిర్మాణాల పనులు జరుగుతున్నాయని వాటితోపాటు రోడ్ల పనులు కల్పించాం.

ప్ర:నీటి సంరక్షణ కోసం ఏమి చర్యలు తీసుకుంటున్నారు.

పీడీ:జిల్లా వ్యాప్తంగా వర్షపు నీరు నిల్వ కోసం చెరువులు, కుంటలలో పూడికతీత పనులు చేపట్టాం. మూడు వాటర్ షెడ్లు ఏర్పాటు చేశాం. ధర్మవరం మండలం ఏలుకుంట్ల, ఎన్‌పి.కుంట మండలం మరికొమ్మదిన్నె, పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామాల్లో వాటర్‌షెడ్ పనులు చేపట్టాం. వాటి ద్వారా 50 కోట్ల రూపాయల నిధులతో చెరువులు పూడికతీత పనులు చెక్ డ్యాములు, రాక్ ఫీల్డ్ డ్యాములు, కందకాలు తదితర పనులతో పాటు ప్రభుత్వ భవనాలు, సచివాలయాలు, ఉన్నత పాఠశాలల వద్ద వర్షపు నీరు నిల్వ చేయడానికి ఇంకుడు గుంతలు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 250 నిర్మించాం. వాటికి ఒక్కొక్క దానికి రూ.50 వేల నుండి లక్ష రూపాయల దాకా ఖర్చు చేస్తున్నా.

ప్రశ్న: ఉపాధి హామీ పథకంలో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అవినీతిపై మీ సమాధానం.

పీడీ : ఉపాధి హామీ కూలీలు బిల్లులు చెల్లింపులు జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమే. కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద బిల్లులు మంజూరు చేయాల్సి ఉండడంతో ఈ జాప్యం జరుగుతోంది. ఉపాధి కూలీల పనుల విషయంలో అవినీతి జరగడానికి ఆస్కారం లేదు. చాలా చోట్ల అవినీతిపై విచారణలు చేపట్టాం. దానికి తోడు సామాజిక తనిఖీలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నాం. ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా అందులో అవినీతి బయటపడిన వెంటనే రికవరీ చేస్తున్నాం. కొంతమంది గ్రామంలో లేని వారు ఉపాధి బిల్లులు పొందుతున్నారని తమ దష్టికి రావడంతో ఆ గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించా. అందులో ఎలాంటి అవినీతీ జరగలేదు.

జెసి చుట్టూ చక్రబంధం

◆ మొన్న కౌన్సిలర్...నిన్న మైనార్టీ నాయకుడు..

◆ వరుసగా కొనసాగుతున్న రాజీనామాలు

◆ ఆర్థికంగా అయిపోయింది... ఇక రాజకీయంగా చెక్ పెడుతున్నారా.?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు త్వరలో రానున్నాయి. ఈ ఎన్నికలకు ముందే తాడిపత్రిలో రాజకీయం జోరుగా మొదలైనట్టు కనిపిస్తోంది. జెసి కుటుంబం చుట్టూ చక్రబంధాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాలు సాగుతున్నట్టు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే ఆర్థికపరమైన అంశాలపై దెబ్బపడిన విషయం తెలిసిందే. ఇక రాజకీయపరంగానూ దెబ్బకొట్టేందుకు సొంత పార్టీలోనే అసంతృప్తులను రాజేసే ప్రయత్నాలను ప్రత్యర్థులు సైలెంట్‌గా చేపడుతున్నారన్న చర్చ నడుస్తోంది. మొన్నటి వరకు అధికార వైసిపికి ధీటుగా నిలబడేందుకు జెసి కుటుంబం ప్రయత్నిస్తూ వస్తోంది. చిన్న అంశం దొరికినా అధికార పార్టీ నేతలపై విరుచుకుపడుతూ వస్తున్నారు. దీనికి అధికారపార్టీ నుంచి కూడా గట్టి సమాధానలే ఎదుర్కోనాల్సి వస్తూ ఉంది. అనేక అవరోధాలు, ఆటంకాలు ఎదురైనా పురపాలక సంఘం ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ టిడిపి కైవసం చేసుకుంది. స్వల్ప మెజార్టీతోనే పురపాలక పీఠాన్ని దక్కించుకున్నప్పటికీ, తమ పార్టీ తరుపున గెలుపొందిన వారెవరూ జారిపోకుండా చూసుకోగలిగారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్‌గా జెసి.ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఛైర్మన్ అయినప్పటి నుంచి కూడా ఆ పార్టీ కౌన్సిలర్లతో పాలకవర్గాన్ని నడిపించే ప్రయత్నం చేశారు. మునిసపాల్టీలో ప్రొటోకాల్ విషయంలోనూ ఇటీవల నిరసన సాగింది. అయితే ఉన్నఫలంగా టిడిపి కౌన్సిలర్ రాబర్టు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడం కలకలం రేపుతోంది. ఆయన పదవికి రాజీనామా చేస్తే పాలకవర్గంలో టిడిపి బలం తగ్గే అవకాశం లేకపోలేదు. దీన్ని అవకాశంగా తీసుకుని అధికారపార్టీ అవిశ్వాసాన్న పెడితే ఏమి జరుగుతుందోనన్న చర్చ నడుస్తోంది. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలుగేళ్ల అవిశ్వాసం పెట్టేందుకు వీల్లేదన్న నిబంధన కొంత ఊరటనివ్వనుంది. అంతలోపు సార్వత్రిక ఎన్నికలు జరిగితే, తదనంతరం ప్రభుత్వం వచ్చాక చూసుకునే అవకాశం ఉంటుంది. త్వరలో సార్వత్రిక ఎన్నికలూ ఉన్నాయి. వాటికి సమయత్తమయ్యే పనిలోనూ జెసి కుటుంబముంది. ఈ క్రమంలో తాజాగా తాడిపత్రికి చెందిన అయూబ్ అనే మైనార్టీ నాయకుడు కూడా టిడిపికి రాజీనామా చేశారు. ఈయన జెసి ప్రబాకర్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం మరో చర్చనీయాంశమైంది. ఆయన వల్లనే పార్టీకి నష్టం జరుగుతోందంటూ రాజీనామా అనంతరం ఆరోపించారు. సొంత పార్టీ నుంచే వరుసగా మరో వ్యక్తి రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వరుసగా సొంత పార్టీలో చోటు చేసుకుంటున్న రాజీనామాల పర్వం వెనుక కారణాలేమై ఉన్నా్య అన్న సందేహాలను ఆ పార్టీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ప్రత్యర్థుల ప్రమేయమం ఏమైనా ఉందా లేక స్వయం తప్పిదాలా అన్న చర్చ నడుస్తోంది. అటు పదవికి, ఇటు రాజకీయంగానూ రెండింటి ఒకేసారి దెబ్బకొట్టేందుకు ప్రత్యర్థులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాన్ని వారి అనుయాయులు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా తాడిపత్రిలో జరుగుతున్న ఈ పరిణామాలు రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి.

ఉక్కు పరిశ్రమ రద్దు నిర్ణయం అన్యాయం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

కలెక్టరేట్ వద్ద ధర్నా కరపత్రాలతో సిపిఎం నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాయలసీమలోని కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీని బిజెపి ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ అన్నారు. సోమవారం నిర్వహించే కలెక్టరేట్ ముట్టడికి సంబంధించిన కరపత్రాలను స్థానిక బస్టాండ్ కూడలిలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉక్కు ఫ్యాక్టరీని రాయలసీమలో ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్రం ఇప్పుడు పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రమంత్రి నిత్యానంద రాయ్ కడపలో ఉక్కు ఫ్యాక్టరీ అవసరం లేదని తేల్చి చెప్పారని అన్నారు ఇందుకు నిరసనగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో ఆందోళన కొనసాగిస్తామన్నారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి సానుకూలంగా ఉన్నాయన్నారు. కేంద్రం వైఖరిని వ్యతిరేకించడంలో ఈ పార్టీలు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. వైసిపి నుండి 22 మంది ఎంపీలు ఉన్నా కూడా వాటిని సాధించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. సోమవారం నిర్వహించే కలెక్టరేట్ వద్ద ధర్నాకు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాధర్, నాయకులు రామాంజనేయులు, నాగేంద్ర ,పెద్దన్న తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి అర్బన్ : కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిన కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలు, కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై సీమకు ద్రోహం చేసిందన్నారు. బిజెపి తన రాజకీయ స్వప్రయోజనాల కోసం రాష్టానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తే సీమ అభివృద్ధితో పాటు వేలాది మందికి ఉపాధి కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

ప్రజాశక్తి క్ష కదిరి టౌన్

కదిరి ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న మహిళా కండక్టర్ తన నిజాయితీని నిరూపించుకుంది. గాలివీడు నుండి కదిరి కి వస్తున్న బస్సులో ప్రయాణిస్తున్న పి.అమానుల్లాబాషా అనే ప్రయాణీకుడు కదిరి డిపో బస్సులో పర్సును పోగుట్టుకున్నాడు. ఈ పర్సులో రూ.28,400ల నగదు, ఆధార్,పాన్ కార్డులు వున్నాయి. ఈ పర్సును బస్సులో కనుగొన్న కదిరి డిపో కండక్టర్ జె. ప్రభావతమ్మ ఆ పర్సును కదిరి బస్టాండు స్టేషన్ మేనేజరు నాగసుబ్బయ్యకు అందజేశారు. పర్సును పోగొట్టుకున్న పి.అమానుల్లాబాషా ఆర్టీసీ అధికారులను సంప్రదించాడు. పర్సులో వున్న ఆధార్,పాన్ కార్డు ఆధారంగా ఆ పర్సును పి.అమానుల్లాబాషాదే అని నిర్ధారించుకున్న స్టేషన్ మేనేజరు నాగసుబ్బయ్య అతనికి అందజేసారు.కండక్టరు ప్రభావతమ్మ నిజాయితీకి కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీగా సేవలందించిన కండక్టరు ప్రభావతమ్మను జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్, డిపో మేనేజరు బి.మైనోద్దిన్, అసిస్టెంట్ మేనేజరు హరిత, హరిమోహన్, అసోషియేషన్ నాయకులు బైరిశెట్టి, శంకరప్ప తదితరులు అభినందించారు.

విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఆదుకుంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం టిడిపి స్థానిక కార్యాలయంలో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణుల సంఘాల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం లో ఆదరణ పథకం ద్వారా పనిముట్లు పంపిణీతో పాటు విరివిగా రుణాలు అందించడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్ళు గడిచిన చేతి వృత్తుల వారిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ ప్రభుత్వంలో అరాచకాలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు, ఇసుక మట్టి దోపిడీలతో ప్రజలు విసిగిపోయారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే చేతివృత్తుల వారి అభివృద్ధికి, సంక్షేమానికి కషి చేస్తామన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు డంకనాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సమస్యలపై పనిచేస్తున్నామని, 2024 ఎన్నికలలో టిడిపి విజయానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ సూర్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు రంగయ్య, నాయకులు ఆనందాచారి, రామాంజనేయులు, గురు ప్రసాద్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ రచయితల జిల్లా సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

అభ్యుదయ రచయితల జిల్లా శాఖను ఆదివారం స్థానిక టీచర్స్ కాలనీలోనితపన సాహితీ వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ప్రముఖ మాండలిక కవి సడ్లపల్లి చిదంబరం రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సడ్లపల్లె చిదంబర రెడ్డి, అధ్యక్షులుగా సిద్ధగిరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా శొంఠి జయప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, కోశాధికారిగా నాగమణి, సహాయ కార్యదర్శిగా విజయ భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రాజశేఖర రెడ్డి, అశ్వర్థ్ నారాయణ, ఎం.సీ.గంగాధర్, బాలగంగాధర్, గంగిరెడ్డి, సలహాదారులుగా వెంకట రామిరెడ్డి, చైతన్య గంగిరెడ్డి, రాజశేఖర రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సమాజములోని మూఢనమ్మకాలు తొలగించి, శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయవలసిన బాధ్యత రచయితలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వర్ రెడ్డి, నాగేంద్ర, ప్రముఖ కవి శాంతి నారాయణ, కర్నాటక రాష్ట్రం ప్రముఖ పరిసరవాది చౌడప్ప, ఆడవాల శేషగిరి రాయుడు, అధ్యాపకులు ఏటిగడ్డ అశ్వర్థనారాయణ, రాజశేఖర రెడ్డి, చైతన్య గంగిరెడ్డి, రైతు సంఘం నాయకుడు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా ఆటో నగర్

ఆటోనగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

◆ సమస్యల వలయంలో జనజీవనం

◆ దశాబ్దం దాటినా అభివృద్ధికి నోచుకోని కాలనీ

◆ రోడ్లులేవు... కాలువలూ లేవు..

◆ ప్రబలుతున్న అంటువ్యాధులు

హిందూపురం ఆటోనగర్ ప్రజల జీవనం సమస్యల నడుమ సాగుతోంది. ఈ కాలనీ ఏర్పడి దశాబ్దం దాటినా ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. అటు పాలకులు పట్టించుకోరు.. ఇటు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఆటోనగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి పురపాలక సంఘానికి అప్పగించాల్సిన గృహ నిర్మాణశాఖ ఆలాంటి చర్యలు చేపట్టలేదు. రోడ్లు, మురుగు కాలువలు లేక చిన్నపాటి వర్షానికే మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి బురద మయం అవుతోంది. దీంతో ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు జీవనం సాగించాల్సిన పరిస్థితి ఉంది.

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణ సమీపంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో 2005-06 సంవత్సరంలో ఆటోనగర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ దాదాపు 3000 కుటుంబాలకు 10 వేలకుపైగా జనాభా ఉంది. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలూ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆటోమొబైల్ షాపులను ఆటో నగర్‌కు తరలించడంతో పాటు దీనిపైనే ఆధారపడిన కుటుంబాలు ఇళ్ల స్థలాలను కేటాయించి ఇళ్లు సైతం మంజూరు చేశారు. దీంతో పట్టణంలోని దాదాపు 3వేల కుటుంబాలకు పైగా ఆటోనగర్‌లో నివాసం కోసం వెళ్లారు. ఇప్పటికి 14 సంవత్సరాలు గడిచినా ఆటో నగర్‌లో కనీస మౌలిక సదుపాయాలను అధికారులు, పాలకులు, కల్పించక పోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఎలాంటి వసతులూ లేకపోయినప్పటికీ అక్కడే నివాసం ఉంటున్నారు. రోడ్లు లేవు... కాలువలు లేవు నివాసం ఎలా వుండాలి అంటూ ఆ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం అయితే ఈ ప్రాంతం మరీ దారుణంగా ఉంటుంది. రోడ్లు, డ్రైయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరంతా రోడ్లపై వస్తోంది. దీంతో పాటు ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇలా పెరగడం వల్ల దోమలు విపరీతంగా పెరిగి ఈ ప్రాంత ప్రజలు అంటు వ్యాధుల బారిన పడుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళనలు చేసినప్పటికీ అధికారులు, పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

ఆటోనగర్ రోడ్డుకు పక్కనే వీవర్స్‌కాలనీ ఉంది. వీవర్స్‌కాలనీలో రోడ్లు, కాలువలు కిరికెర పంచాయతీ అధికారులు వేస్తుండటం చూసి వారిని అడిగితే పంచాయతీ పరిధిలోకి ఆటోనగర్ రాదని అక్కడి అధికారులు చెబుతున్నారు. హౌసింగ్ అధికారులను అడిగితే వారి నుంచీ ఎలాంటి స్పందనా లేదు. ఆటోగర్ ఎవరి పరిధిలోకి వస్తుందో తెలియని అయోమయ స్థితిలో ఈ ప్రాంతంలో ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వర్షాలు పడితే రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి. వీటిపై వృద్ధులు, బాలింతలు రోడ్డు దాటుతూ కిందపడి ఆసుపత్రి పాలవుతున్నారు. సమస్యలకు తోడు ఈ కాలనీల్లో పందులు కూడా స్వైరవిహారం చేస్తున్నారు. దీంతో ఇంట్లో నుంచి బయటకు రావాడానికి సైతం జనం

ఆటో నగర్‌లో బురదమయం అయిన రోడ్లు

జంకుతుంటారు. హౌసింగ్ బోర్డు అధికారులు నిబంధనల మేరకు ఆటోనగర్‌లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి పురపాలక సంఘానికి అప్పగిస్తే అప్పటి నుంచి ఆ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు పురపాలక అధికారలూ కల్పించడంతో పాటు ఇంటి గుత్తలు, కొళాయిలు ఏర్పాటు చేసి ఆ సమస్యలను పరిష్కరించడానికి సాధ్యం అవుతుంది. అయినప్పటికీ పురపాలక సంఘం అధికారులు ఆ ప్రాంతంలో అధిక శాతం పట్టణ వాసులే నివాసం ఉంటున్నారని నీటి కొళాయిలు ఏర్పాటు చేసి నీటి సౌకర్యాన్ని కల్పించారు. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలంటే హౌసింగ్ అధికారులు పూర్తిస్థాయిలో ఆటోనగర్‌ను అప్పగించినప్పుడే సాధ్యమవుతుందని పురపాలక సంఘం అధికారులు పేర్కొంటున్నారు.

జనాభా ఎక్కువ ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం లేదు..

ఆటోనగర్ ప్రాంతంలో దాదాపు 10 వేల మంది వరకు నివాసం ఉంటున్నారు. ఈ ప్రాంతం ఇప్పటికే పురపాలక సంఘ ఆధీనంలో ఉంది. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, పట్టణానికి దాదాపు 3 నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆటోనగర్‌కు ఎలాంటి సౌకర్యాలు లేవు, ఎవరైనా జబ్బుల బారిన పడితే వారిని ఆసుపత్రికి తీసుకు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. వీరి కోసం ఈ ప్రాంతంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలను ప్రారంభించి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక నిధులతో ఆటోనగర్‌ను అభివృద్ధి చేస్తాం

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేసినా ఆటోనగర్‌ను ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అన్ని విధాల అభివృద్ధి చేస్తాం. గత పాలకులు ఆటోనగర్‌ను నిర్లక్ష్యం చేశారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తాను బాధ్యతలు స్వీకరించగానే ఆ ప్రాంత ప్రజలు కలిసి సమస్యను వివరించారు. త్వరలో ఆ ప్రాంతాన్ని పరిశీలన చేస్తాం. ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు మురికివాడలో అభివృద్ధి కోసం ఎక్కువ నిధులు కేటాయిస్తోంది. మున్సిపల్ అధికారులతో అభివృద్ధికి నివేదికను సిద్ధం చేసి, దీనిపై త్వరలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను వివరిస్తాం. ప్రత్యేక నిధులను తీసుకొచ్చి అన్ని విధాలా ఆటోనగర్ణు అభివృద్ధి చేస్తాం.

వైసిపి సమన్వయకర్త దీపిక వేణురెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com

గ్రంథాలయం తనిఖీ

పెనుకొండ : పట్టణంలోని శాఖ గ్రంధాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమా మోహన్ రెడ్డి ఆదివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయనికి సంబందించిన పలు రికార్డులు పరిశీలించి, గ్రంథాలయ పన్ను వసూలుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అధ్యక్షులు ఎల్ఎం. మోహన్ రెడ్డి, గ్రంథాలయాధికారి కె.మహబూబ్‌బాషా, పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎం.రాయపురంలో విగ్రహప్రతిష్టాపన

రొళ్ల : మండల పరిధిలోని ఎం. రాయపురం గ్రామంలో నాగుల విగ్రహ మండల పూజను కొనసాగిస్తున్నారు. 48వ రోజైన ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంకర్రావు, డాక్టర్ సురేష్ శాస్త్రిలకు చెందిన పూర్వికుల జ్ఞాపకార్థంగా ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గురుమూర్తి, సూర్య ప్రకాష్ రావు, బోజే గౌడ్, రామకృష్ణ తదితరులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

కదిరి టౌన్ : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యేయ సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి రూరల్ మండలం, కొండమనాయనపాళ్యం గ్రామ పరిధిలోని చౌటితండా, చిగురుమాని తండా, నల్లగుట్టతండాలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు తదితర నాయకులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మొహరం వేడుకలు

మడకశిర : మొహరం పండుగను నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని కే గుండుమల గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని గాండ్లపెంట, కట్టారుపల్లి, తూ పల్లి, ఎనుముల వారి పల్లి. జీనలకుంట. తదితర గ్రామాలలో ఆదివారం ఘనంగా మొహరం వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తలుపుల : మండల కేంద్రంలో ఆదివారం మస్తాన్ వలి ఉరుసు పీర్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అగ్నిగుండము సోమవారం తెల్లవారుజామున జలిది జరుగుతుందని నిజావర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ మక్బుల్‌బాషా ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

కొత్తచెరువు రూరల్: కొత్తచెరువు మండలంలో ఆదివారం సాంప్రదాయ బద్ధంగా జలిది మహోత్సవాలను నిర్వహించారు. హిందూ ముస్లింలు ఐక్యతతో మొహరం సంబరాలను జరుపుకున్నారు. కొత్తచెరువు మండలంలో ఆదివారం 11చోట్ల జలధి ఉత్సవాలను నిర్వహించారు. నారేపల్లి, కోడప గాని పల్లి, తలమర్ల లో మూడు చోట్ల, మీర్జాపురం బండ్లపల్లి మరకుంటపల్లి, కేశపురం, కొత్తచెరువులో ఇసుక వంక, కొండ కింద,ఆంధ్ర బ్యాంకు వద్ద, తదితరచోట్ల జలది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పుట్టపర్తి రూరల్ సిఐ రాగిరి రామయ్య, ఎస్ఐ లింగన్న ఆధ్వర్యంలో గట్టి భద్రత ఏర్పాట్లు చేశారు.

కదిరి అర్బన్ : మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ హమాలి క్వార్టర్స్‌లో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ పి వి సిద్దా రెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మ పరిరక్షణకు, త్యాగానికి ప్రతీక మొహర్రం అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలో మోహరం వేడుకలు కోలాహలంగా జరిగాయి. పెద్ద బజారులో కొలువైన పీర్లను ఆదివారం జల్దీకి తీసుకెళ్లారు. వారం రోజులుగా కొలువైన పీర్లను మంగళ వాయిద్యాల నడుమ డప్పులతో ఊరేగించారు. స్నేహానికి పవిత్రతకు చిహ్నంగా జరిగే ఈ వేడుకలు వైభవంగా జరిగాయి. ఎలాంటి ఘర్షణలు జరగకుండా సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



పుట్టపర్తిలో పీర్ల ఊరేగింపు

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE, HINDUPUR
O.S.397/2019

Between:-
Hindupur Kuruba Sangam by its President K.H.Sreeramulu ...Plaintiff
And
K.V.Chalapathi and others ...defendants

NOTICES TO THE DEFENDANT NO.4
To
04) G.Jagadish s/o Mallikarjuna, Mothukapalli, Hindupur-Mandal.

Take notice that the above matter stands posted to 29.08.2023 for your appearance and hence you are required to attend either in person or through your advocate on the above said date at 10.30 A.M. before the above said court, failing which the matter will be decided exparte.

K.SATYANARAYANA
Advocate, Hindupuramu

పండ్ల మొక్కల పంపిణీలోనూ అక్రమాలు

ఎన్ని మొక్కలు వచ్చాయన్నది చెప్పని అధికారులు ఎవరికిచ్చారన్నదానిపైనా మౌనం

మండలానికి వచ్చిన పండ్లమొక్కలను దించుతున్న దృశ్యం

ప్రజాశక్తి - మడకశిర రూరల్

సాగునీటి సౌకర్యం లేక కేవలం వర్షాధారంతో సాగు చేస్తున్న మెట్టభూమి రైతులకు అండగా నిలవడంతో పాటు ఆర్థిక పరిపుష్టిని అందించే పండ్ల తోటల పెంపకాన్ని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా శ్రీకారం చుట్టాయి. అయితే చేతివాటానికి అలవాటు పడ్డ క్షేత్రస్థాయి సిబ్బంది రైతుల కందించే పండ్ల మొక్కల పంపిణీలోనూ అవినీతికి తెర లేపి ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఉపాధి హామీ ద్వారా రైతులకు అందిస్తున్న పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన కల్పించి, ఆ పొలంలో పెంచుతున్న మొక్కల గురించి రైతు పేరుతో సమాచార బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉండగా అలాంటిది ఏదీ మండలంలో కన్పించలేదు. సమాచారాన్ని గోప్యంగా ఉంచి మొక్కల పెంపకంలోనూ అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. తాజాగా రాజమండ్రి నుంచి మొక్కలు మడకశిరకు గురువారం మధ్యాహ్నం వచ్చాయి. వాటిని రైతులకు పంపిణీ చేసేటప్పుడు కూడా అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయంపై ప్లాంటేషన్ అధికారి నరహరిని ఎన్ని మొక్కలు వచ్చాయి, ఎంతమందికి పంపిణీ చేశారని అడుగగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. పైగా మా ఏపీడీని అడగండి అంటూ వెటకారంగా సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై ఏపీడీని వివరణ అడగగా ఆ అధికారి వద్ద కూడా సమాచారం లేదని తేలింది. దీన్నిబట్టి చూస్తే ఈ పండ్ల మొక్కల పంపిణీ భాగోతంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బాగోతంపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి- రొళ్ల

మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. ఎక్కడ చూసినా మురుగుగుంతలు దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్డుమీద నీరు నిల్వ ఉండి ఆయా ప్రాంతాలు దోమలకు నిలయంగా మారాయి. దాదాపు అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామాల అభివృద్ధి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. పారిశుధ్యం లోపించి దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధానంగా మండలకేంద్రంలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. మండల కేంద్రం నుంచి ఆగళికి వెళ్లే రోడ్డు మార్గంలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్యంపై పర్యవేక్షించి మెరుగుపరచాల్సిన అధికారుల జాడలేదు. పంచాయతీ పాలకులు పట్టించుకోవటం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాలు మండలంలో అటకెక్కాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నా పంచాయతీ. ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది పల్లెల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం పూర్తిగా లోపించింది. ఫలితంగా గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రొళ్లలో యథేచ్ఛగా అసాంఘిక కార్యక్రమాలు

పజాశక్తి- రొళ్ల

రొళ్ల మండలంలో అసాంఘిక కార్యక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రధానంగా పేకాట విజృంభిస్తోంది. పేకాటను నివారించడంలో మండల పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇటీవల అగలి మండల పోలీసులు రొళ్ల మండలపరిధిలోని పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ జూదం ఆడుతున్న వారిలో ప్రధాన నిందితుడు రొళ్ల మండలానికి చెందిన వారే ఉన్నారు. ఈ నిందితుడికి స్థానిక పోలీసులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. పక్క మండల పోలీసులు వచ్చి దాడులు నిర్వహించి పేకాట జూదరులను అరెస్టు చేశారంటే రొళ్లమండల పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.. దీనిపై స్థానిక ఎస్ఐ వెంకటరమణను సంప్రదించగా ఆగలి రొళ్ల సరిహద్దులో ఉండే గుట్టల్లో జూదం ఆడుతున్నట్లు ఆగలి ఎస్ఐకు సమాచారం రావడంతో వారు దాడులు నిర్వహించారని చెప్పారు. తాను తన సిబ్బందితో కలసి గిరినాయికన పాళ్యం గ్రామ సమీపంలో దాడులు నిర్వహించి జూదరులను అరెస్టు చేసినట్లు చెప్పారు.

పేదలను నట్టేట ముంచిన వైసిపి ప్రభుత్వం

జనసేన నాయకులు

ఇందిరమ్మ కాలనీలో జనసేన నాయకులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

పేద ప్రజలకు వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి అప్పులపాలు చేసిందనిజనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి పత్తిచంద్రశేఖర్ విమర్శించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొత్తచెరువులోని పెనుగొండ రోడ్డువద్ద గల జగనన్న కాలనీలో నిర్మాణాలను వారు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 483 సర్వే నెంబర్లు 379 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి వారికి గృహాలు మంజూరు చేశారన్నారు. ఈ కాలనీకి రహదారి సౌకర్యం లేదన్నారు. కొండగుట్టల్లో ఇచ్చిన స్థలాల్లో నిర్మాణాలు చేయాలంటే పేదలకు తలకు మించిన భారం అవుతోందన్నారు. ఎక్కడ చూసినా గుంతలు ఉండడంతో లబ్ధిదారులు ఎవరు ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వం ఇల్లు నిర్మించుకోకపోతే పట్టా రద్దు చేస్తామనడంతో లబ్ధిదారులు పునాదులకు మాత్రమే పరిమితమయ్యారన్నారు. నాలుగు సంవత్సరాలు పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ కానీ మొదలు కాలేదన్నారు. ఇక్కడ ఇంటి నిర్మాణాలు చేపట్టితే పెద్దపెద్ద బండరాళ్లు కొండలో నుండి కిందికి పడితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు ప్రభుత్వం స్పందించి నిర్మాణాలకు రుణాలను పెంచి వాటి నిర్మాణాలను వేగవంతం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అబ్దుల్ అబూ, కన్వీనర్లు పూల శివప్రసాద్, జయరాం, తలారి పెద్దన్న, నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి పట్టణం గట్టు వద్ద ఉన్న జగనన్న కాలనీలో జనసేన పార్టీ ఇంచార్జ్ భైరవ ప్రసాదు అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు కాలనీ సందర్శించి అక్కడి సమస్యలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అప్పట్లో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఎన్నో అబద్దపు హామీలు ఇచ్చి, ఆ తర్వాత గద్దెనెక్కి నవరత్నాలు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. జగనన్న కాలనీ ప్రజలను నిట్టనిలువునా మోసం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికి ఈ శాఖకు ఇద్దరు మంత్రులు మారారని కానీ ఇల్లుళ్లు ఎన్ని పూర్తయ్యాయో, ఎన్ని కాలేదో కనీసం సమీక్ష చేసిన పాపాన పోలేదని ఆరోపించారు. వైసీపీ ఎమ్మెల్యే లకు, మంత్రులకు ధైర్యం ఉంటే జగనన్న కాలనీలలో పర్యటించి అక్కడి ఎటువంటి వసతులు ఉన్నాయో మీడియా ముఖంగా ప్రజలకు తెలియజేయాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు చలపతి, నల్లచెరువు మండల అధ్యక్షులు రవికుమార్,కార్యక్రమల నిర్వహణ కమిటీ సభ్యులు లక్ష్మణ్, అంజిబాబు, కిన్నెరా మహేష్, రాజేంద్ర, హరిబాబు, చంద్రశేఖర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రాజెక్టు పనుల పూర్తి

కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి కదిరి అర్బన్

రాష్ట్రంలో ప్రాజెక్టులు పనులు పూర్తి చేయాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్ట్ 1 నుంచి సాగునీటి ప్రాజెక్టుల సందర్శనకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వస్తున్నట్లు చెప్పారు. తెలుగుతల్లికి జలహారం, తెలుగునేలకు జలహారం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైసీపీ పాలనలో నిలిచిపోయిన ఇరిగేషన్ ప్రాజెక్టులను చంద్రబాబు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.కర్నూలు నుంచి శ్రీకాకుళం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. పెన్నా నుంచి వంశధార ప్రాజెక్టు వరకు ప్రధాన నదులపై ఉన్న కీలక ప్రాజెక్టులను చంద్రబాబు పరిశీలిస్తారన్నారు. ఇందులో భాగంగానే ఆగస్టు మూడవ తేదీన మండల పరిధిలోని ముత్యాల చెరువు గ్రామం నుండి అలిపూర్ తండా, కోనేరు, హిందూపురం క్రాస్, టవర్ క్లాక్, వేమారెడ్డి సర్కిల్,అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తామనితెలిపారు. అనంతరం జీవిమాను సర్కిల్, మదనపల్లి రోడ్డు మార్గాన వచ్చి కొక్కంటి క్రాస్ లో రాత్రి చంద్రబాబు బస చేస్తారన్నారు. 4వ తేదీన కొక్కంటి క్రాస్ నుంచి అన్నమయ్య జిల్లా లో కి చేరుకుంటారని కందికుంట వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు,క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, అనుబంధ సంఘాల వారు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

త్వరలో వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

యువతను ప్రోత్సహించే విధంగా త్వరలో కదిరి నియోజకవర్గంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు సీనియర్ నాయకులు డాక్టర్ బత్తల వెంకట రమణ తెలిపారు. క్రికెట్ టీమ్ కెప్టెన్లతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బత్తల వెంకట రమణ మాట్లాడుతూ యువతలోనీ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి మండలం నుండి క్రీడాజట్లను టోర్నీలో ఆడించి విన్నరప్, రన్నరప్‌నిఎంపిక చేస్తామన్నారు. అదేవిధంగా కదిరి టౌన్,రూరల్ మండలంలో కూడా టోర్నీలో రన్నర్, విన్నర్స్ ని ఎంపిక చేస్తామని తెలిపారు. త్వరలో ఈ టోర్నీ సంబందించిన కరపత్రలు ఆవిష్కరిస్తామని వివరించారు. క్రికెట్ టోర్నీలో ఆడేందుకు టీముల నమోదు గడువును పొడగించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు సంపంగి గోవర్ధన్,క్రికెట్ టీమ్ ఆర్గనైజర్ ఆది, టీమ్ కెప్టెన్లు, సభ్యులు పాల్గొన్నారు

త్వరలో వడ్డెర్ల ఆత్మీయ సమావేశం :కదిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల వడ్డెర్లతో త్వరలో వడ్డెర్లతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తామని సీనియర్ నాయకులు బత్తల వెంకట రమణ తెలిపారు. నియోజకవర్గంలోని కొంత మంది వడ్డెర ముఖ్యనాయకులతో ఆదివారం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన వడ్డెర్లకు రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా ఈ సమావేశం జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ వడ్డెర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే టిడిపి ధ్యేయం

కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారధి

ప్రజాశక్తి రొద్దం

మహిళల సమగ్ర అభివృద్ధే చంద్రబాబు ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారథి అన్నారు. మండలంని లోచర్ల గ్రామంలో నిర్వహించిన మహాశక్తి కార్యక్రమంలో పార్థసారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మహిళా విభాగం ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికి తిరిగా భవిష్యత్తుకి గ్యారెంటీ పథకాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ 2024 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి సతీమణి కమలమ్మ, మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, కన్వీనర్లు నరహరి, సిద్దయ్య, నేత్రవతి, లీలావతి, అనురాధ, నాగమణి, బేబీ, తులసి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మ్యానిఫెస్టో మహిళల అభ్యున్నతికి మహాశక్తి తోడ్పాటు అందిస్తుందని అన్నారు. మహాశక్తితో భవిష్యత్తుకి గ్యారెంటీ సూపర్ సిక్సర్ మినీ మేనిఫెస్టోను ఆదివారం పట్టణంలోని లక్ష్మీపురం,మోడాల్ కాలనీల్లో తెలుగు మహిళ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పెరిగిన నిత్యావసర ధరలు, పెట్రోల్, డిజల్, కరెంట్ బిల్లులు, గ్యాస్ ధరలు, ఇంటి పన్నులు పెంపు, ఆర్టీసీ చార్జీలు పెంపు, చెత్త పన్ను తదితర ప్రజా వ్యతిరేక విధానాల్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి పరిమళ, వార్డు కౌన్సిలర్ దుర్గా మంజుళ, క్లస్టర్ ఇన్‌ఛార్జి వెంకటేష్, పార్లమెంట్ మహిళా కార్యదర్శి చెన్నమ్మ, పట్టణ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, గాద్రాలపల్లి లక్ష్మీదేవి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ నాయకులను కలిసిన దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి సమన్వయ కర్తగా బాధ్యతలు స్వీకరించిన దీపిక వేణు రెడ్డి పట్టణంలో విస్తృతంగా పర్యటిస్తు అన్ని సామాజిక నాయకులతో పాటు పార్టీ నాయకులతో కలుస్తున్నారు. ఆదివారం జామీయ మసీదు సాని ముత్వల్లీ హుమయున్ ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వెళ్లి మైనార్టీ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఐక్యంగా అందరం కలిసి 2024 ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబు రెడ్డి, వేణు రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, ముతవల్లీలు ఖలీల్, సనావుల్లా, ముస్లిం యువ నాయకులు ఆసిఫ్, జుబేర్, సమీవుల్లా, అతావుల్లా, జడ్పిటిసి బాణాల శ్రీనివాసరెడ్డి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత్ రెడ్డి,నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, మార్కెట్ చాంద్, సిపిసి సాదిక్, రాచపల్లి మహేందర్ రెడ్డి, రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబనికి ఆర్థికసాయం అంజేస్తున్న స్నేహితులు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

కొత్తచెరువు : కొత్త చెరువులోని బీసీ కాలనీకి చెందిన పంచర్ షాప్ మహబూబ్ పీరా ఇటీవలే కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈనేపథ్యంలో మహబూబ్‌పీరాతో పాటు 2006 – 07 సంవత్సరంలో పదవ తరగతి చదివిన మిత్రులు కలసి పీరా కుటుంబానికి ఆర్థికసాయం చేశారు. 22 వేల రూపాయల నగదు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాల చలపతి, జనార్ధన్, పవన్, నాగేంద్ర, రామానంద తదితరులు పాల్గొన్నారు.

కాలంచెల్లిన బస్సులతో అవస్థలు

హిందూపురం : హిందూపురం ఆర్‌టిసి డిపో పరిధిలో కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున పాల సముద్రం సమీపంలో బస్సు వస్తున్న సమయంలో ఐటెక్ బస్సు కిటికి అద్దాలు ఒక్క సారిగా పగలడంతో కిటికి పక్కన కుర్చోన్న ప్రయాణికుడి గాయాలు అయ్యాయి. ఆ సమయంలో అ వ్యక్తి జర్కిన్ ధరించడంతో చెయ్యికి గాజు ముక్కలు తగిలి చిన్న దెబ్బలు తలిలాయి. తిరుపతి నుంచి హిందూపురం వస్తున్న ఐ టెక్ బస్సులో ప్రయాణికుడిపై బస్సు కిటికీ అద్దాలు పగిలి పడ్డాయి. ఆ సమయంలో ప్రయాణికుడు జర్కిన్ వేసుకొని ఉండడంతో తలకు ఇతర శరీర భాగాలకు ప్రమాదం తప్పింది. చేతులకు గాజు ముక్కలు గుచ్చుకొని స్వల్ప గాయాలయ్యాయి. కాలం చెల్లిన బస్సులనే నడుపుతూ అందులోనూ హైటెక్ సర్వీస్ చార్జీలను వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలంటే ప్రజలు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సీనియర్ సిటిజన్ల రాష్ట్రకమిటీ ఏర్పాటు

పుట్టపర్తి రూరల్: సీనియర్ సిటిజన్ల శ్రీ సత్య సాయి రాష్ట్రకమిటీ ఎంపికను శనివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులుగా వి నారాయణమూర్తిని, స్టేట్ జనరల్ సెక్రటరీగా రామచంద్రారావు, స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా వెంకటరమణ, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాసిం, డిస్టిక్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామిరెడ్డిని ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా ఎం నాగేందర్ రెడ్డితోపాటు ముగ్గురు సహాయ కార్యదర్శులను, 12 మంది ఈసీ మెంబర్లుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లాలో సీనియర్ సిటిజెన్లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి తమ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమస్యలను తెలుసుకోవడానికి ప్రతినెల సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

పవిత్రమైనది స్నేహబంధం

ధర్మవరం టౌన్ : అన్నిటికంటే పవిత్రమైన బంధం స్నేహబంధం అని రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు. స్నేహితుల దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహబంధం ఎంతో విలువైనదని ఈ బంధానికి ఎల్లలు ఉండవని అన్నారు. అంతటి గొప్ప స్నేహ బంధానికి గుర్తుగా ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. భారతదేశం, అమెరికాతో సహా చాలా దేశాలు ఆగస్టు మొదటి ఆదివారంలో ఈ వేడుకలను జరుపుకుంటాయని తెలిపారు. ఈ రోజున జాతి రంగు కుల మత భేదాలు లేకుండా మనుషులంతా స్నేహభావంతో మెలి గేందుకే ప్రత్యేకగా స్నేహితుల దినోత్సవం జరుపుకుంటారని చెప్పారు. స్నేహ బంధానికి విలువ కట్టలేమని, అది విడదీయరాని మంచి బంధమని వారు తెలిపారు. స్నేహితులు ఒక్కరిపై ఒకరు పూర్తి విశ్వాసం, నమ్మకంతో ఉంటారని తెలిపారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ స్నేహభావాన్ని పెంపొందించుకొని సుఖవంతమైన జీవితాన్ని గడపాలని వారు తెలిపారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

హిందూపురం : ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోసూరు సతీష్ శర్మ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నానెప్ప నగర్ లోని శ్రీ గాయత్రి ఆలయ కళ్యాణ మండపంలో స్వాతంత్ర సమరయోధుడు కల్లూరు సుబ్బారావు మనవడు కల్లూరు ఆదినారాయణ రావు అధ్యక్షతన శ్రీ సత్యసాయి జిల్లా బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కోసూరు సతీష్ శర్మ హాజరై మాట్లాడారు. సంఘాలు, సమాఖ్యలు అభ్యున్నతి సాధించాలంటే కమిటీ కార్యవర్గ సభ్యులతో పాటు బ్రాహ్మణ కుటుంబాలన్నీ సహకారం అందించాలన్నారు. అనంతరం నూతనంగా ఎంపికైన జిల్లా సమాఖ్య అధ్యక్షులు దేశాయి మురళి, ప్రధాన కార్యదర్శి టీఎస్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు డిఎ రామమూర్తి, ఎం. శ్రీనివాస్, కోశాధికారి కల్లూరు మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీలు నంజుండ రావు, కె. వెంకటేష్, మారుతీ రావు, సత్యనారాయణ రావు తదితరులు ప్రమాణ స్వీకారం చేయగా వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మనోహర రావు, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రతినిధులు పివి ప్రసాదరావు, ఎస్.కె రాఘవేంద్రరావు, లక్ష్మణరావు, నాగేశ్వరరావు, సమాఖ్య రాష్ట్ర మహిళా సంఘం ప్రతినిధులు పార్వతమ్మ, గాయత్రి, సంధ్య, నాగ స్రవంతి, హిందూపురం బ్రాహ్మణ ప్రముఖులు పాండురంగారావు, సోమశేఖర శాస్త్రి, పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

బుక్కపట్నం :గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు సత్యసాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. ఆదివారం బుక్కపట్నం, కొత్తకోట గ్రామాలకు చెందిన క్రీడాకారులకు క్రికెట్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించి వారిలోని క్రీడ నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా క్రీడాకారులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. నేటి తరం యువత క్రీడలతో పాటు చదువులలో రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, హరినాథ్ చౌదరి, ఆదికేశవ నాయుడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటుదాం

ధర్మవరం టౌన్ : రక్త, నేత్రదానాలతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ధర్మవరం ఉపశాఖ నూతన కార్యవర్గచైర్మన్ డాక్టర్ నరసింహులు తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో సత్యసాయి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది కొతసభ్యులు నరేంద్రరెడ్డి, సత్యనిర్ధారణ్ ఆధ్వర్యంలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ మాట్లాడుతూ రక్త, నేత్రదానాలతోపాటు మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతామని చెప్పారు. రెడ్ క్రాస్ సభ్యత్వాలు మరింత పెరిగే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం నూతన కమిటిని ఎంపికచేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ధర్మవరం ఉపశాఖ చైర్మన్‌గా నరసింహులు, వైస్ చైర్మన్‌గా నరేంద్రరెడ్డి, ప్రధానకార్యదర్శిగా బోనాలశివయ్య, సహాయకార్యదర్శిగా మనోహర్ గుప్త, కోశాధికారిగా సత్య నిర్ధారణ, బ్లడ్ డొనేషన్అండ్ గ్రూపింగ్ చైర్మన్‌గా శ్రీరాములు, మొక్కల పెంపకం విభాగం చైర్మన్‌గా బత్తలపల్లి జయసింహ, కాలుష్యనివారణ పరిరక్షణ విభాగం చైర్మన్‌గా సుదర్శన్ గుప్తా, వృద్ధులు సామాజిక ఆరోగ్య ప్రణాళిక విభాగం ఛైర్మన్‌గా సత్యనిర్ధారణ, సామాజిక వైద్యశిబిరాల విభాగం చైర్మన్ సత్రశాల ప్రసన్నకుమార్లను ఎంపిక చేశారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి ధర్మవరం ఉపశాఖ నూతన కార్యవర్గ సభ్యులు